హత్య చేయని హంతకుడు!

వసుంధర

"బాస్! ఇంతకాలం నువ్వు నాకు చేసిన సాయానికి ధన్యవాదాలు. ఇక నాకు సెలవు ఇప్పించు" అన్నాడతను.

"సెలవా? ఎందుకు" అన్నాడు బాస్ ఆశ్చర్యంగా.

"ఈ వృత్తికీ, నా మనస్తత్వానికీ సరిపడదు బాస్! నీ దయవల్ల ఇప్పటికి కొంత డబ్బు కూడబెట్టుకోగలిగాను. ఆ ఆధారంతో నా జీవన విధానాన్ని మార్చుకుంటాను" అన్నాడతడు.

"వెర్రివాడా-మంచితనానికివి రోజులు కావు. నీ సామర్థ్యం నన్నెంతగానో ఆకర్షించింది. నిన్ను నేను వదులుకోలేను. నువ్వుగానీ న్యాయస్థానానికి భయపడుతున్నావేమో - నాకు అనుచరుడిగా వున్నంతకాలం ఆ భయం నీకుండదు. ఏదో వెర్రి ఆవేశంలో పిచ్చి పిచ్చి నిర్ణయాలు మాత్రం తీసుకోకు."

"లేదు - బాస్ ఇది ఆవేశంతో తీసుకున్న నిర్ణయం

కాదు. ఆశతో తీసుకున్న నిర్ణయం. నేరాలు చేయడం నా మనసుకు సరిపడ్డంలేదు" అన్నాడతను దిగులుగా.

బాస్ అతనివంక పరీక్షగా చూశాడు. అతని ముఖ కవళికల్ని బట్టి మనసులో భావాల్ని చదివాడు.

అతడి గురించి బాస్‌కు బాగా తెలుసు. కూటికి గతి లేని పరిస్థితుల్లో అతనుండగా తను చేరదీశాడు. తగిన శిక్షణ యిచ్చి నేరాలు చేయించి డబ్బు సంపాదించాడు. అతని మంచితనం, నమ్మకత్వం తనను ఆకర్షించగా తనకు ఆంతరంగికుణ్ని గా చేసుకొన్నాడు. ఇప్పుడైనా సరే—అతను తన మాట కాదనడు. ఎటొచ్చీ గతిలేక నేరాలు చేస్తున్నాడు తప్పితే యిలాంటి జీవితం అతనికి నచ్చదు. ఏదో వొకరోజున అతనిలాంటి మాట అంటాడని బాస్‌కు తెలుసును.

"ఎస్. నీ మాట కాదనను. నిన్ను బలవంత పెట్టను. నువ్వు చేసిన పాత నేరాల గురించి నిన్ను బ్లాక్ మెయిల్ చేయను. నీకు పూర్తి స్వతంత్రం ఇస్తాను. కానీ...." అని ఆగాడు బాస్.

అతను ఆత్రుతగా బాస్ వంక చూశాడు. ఆ.... "కానీ" పైనే తన భవిష్యత్తు అంతా ఆధారపడి ఉంది...."చెప్పు బాస్!" అన్నాడు.

"నువ్వో హత్య చేయాలి....!" అన్నాడు బాస్ తాపీగా.

"హత్యా!...." అన్నా డతను కంగారుగా—"ఎందుకు?"

"హత్య లెందుకు చేస్తారు? మన నిబ్బంది పెడుతున్న

మనిషిని అడ్డు తొలగించుకోవడానికి. ఓ మనిషి కారణంగా నాకు కొన్ని ఇబ్బందులొచ్చాయి. ఆ మనిషిని నేను స్వయంగా చంపడానికి లేదు. ఏ కేసులోనూ నేను డైరెక్టుగా యిన్వాల్వ్ కాలేనుగదా! ఊళ్ళో నాకున్న పేరు ప్రఖ్యాతులింతా అంతా కావు. అలాంటప్పుడు నా అనుచరులే నాకు పని చేసిపెట్టాలి. అనుచరుల్లో నువ్వు తప్ప నమ్మకస్థులింకెవరున్నారు నాకు?" అంటూ బాస్ అతనివంక దీనంగా చూశాడు.

"కానీ యింతవరకూ నేనెన్నడూ హత్య చేయలేదు...."

"వెర్రివాడా—అన్ని నేరాల్లోకీ అదే సులభమైనది" అంటూ నవ్వాడు బాస్.

"వద్దు బాస్! నన్ను హత్యకు పురికొల్పవద్దు. కావాలంటే నీవద్ద మరికొంతకాలంపాటు పాత పనులే కొనసాగిస్తాను. హత్య చేయమని మాత్రం చెప్పకండి—" అన్నాడతను. అతని అసహాయత అతని కంఠంలో ధ్వనిస్తోంది.

"నువ్వు తప్ప నాకు నమ్మకస్థులు లేరు. ఆ మనిషి చావు నాకు ముఖ్యం. ఈ ఒక్క పనీ నువ్వు నాకు చేయక తప్పదు. ఇది పనికాదు, సాయం. ఇది నా ఆజ్ఞ కాదు. అర్థింపు. నా అవసరాన్ని అర్థం చేసుకుని నాకు సహకరించు. ఈ ఒక్కసారికీ నా మాట మన్నించగలిగావంటే జీవితంలో యిదే నువ్వు చేసే ఆఖరి నేరం కాగలదు...."

"నేను చేస్తున్న నేరాలు చివరికి నన్ను హంతకుడిగా మారుస్తాయేమోనని భయపడే ఈ వృత్తిని వదిలిపెట్టాలనుకుంటే నువ్వు నా ఆఖరి నేరాన్ని హత్యకు నియో

గిస్తున్నావు. నేను హత్యలు చేయలేను. హంతకుణ్ని కాలేను. నన్ను వదలిపెట్టు బాస్!" అన్నాడతను వేడుకుంటున్నట్లుగా.

"హత్య చేస్తావో, మానతావో నీ ఇష్టం. ఆ మనిషి చావడం నాక్కావాలి. హత్య చేయకుండా చంపగలననుకుంటే అలాగే చేయి. ఇందుకు నీకు మూడు నెలల వ్యవధకూడా ఇస్తున్నాను—"

ఈ పని తనకు తప్పదని అతనికి అర్థమైంది. ఒక మనిషిని చంపాలని నిర్ణయించుకున్నాక—హత్య తప్ప మరో మార్గమేముంటుంది? అంటే తను హంతకుడు కాక తప్పదు.

అతను గుండె రాయి చేసుకొన్నాడు—"ఇంతకీ ఆ మనిషి యెవరో చెప్పు బాస్!"

"ఇప్పటికి దారికి వచ్చావ్—" అని—"నీకు గోకీనాథంగారు తెలుసు ననుకొంటాను....—" అన్నాడు బాస్.

గోకీనాథంగారు మరీ గొప్పవాడు కాకపోయినా ఆ ఊళ్ళోని ధనవంతుల్లో ఒకడు. చాలామందికి తెలిసినవాడు. అతనికి గోకీనాథం తెలుసును. భయంగా బాస్ వంక చూసి—"నేను గోకీనాథంగారిని చంపాలా?" అన్నాడు.

"అలా కంగారుపడకు. గోకీనాథానికి రూప అని ఓ కూతురుంది. తెలుసా?"

రూపని అతను చూడలేదు. కానీ ఆమె గురించి కొంత విన్నాడు. రూప అందంగా ఉంటుందట. ఆ అందం చూసి బాస్ కొడుకు కృష్ణారావు ఆమెను ప్రేమించాడు.

కానీ రూప అతన్ని నిరాకరించింది. ఆ కారణంగా బాస్ గౌరీనాథంమీద పగబట్టాడుకూడా.

అయితే తనిప్పుడు చంపవలసింది ఒక ఆడపిల్లనా అనుకున్నాడు అతను.

“రూపకాదు. ఆమె మరొకరిని ప్రేమిస్తుంది—” అంటూ బాస్ వివరించసాగాడు.

అతను శ్రద్ధగా వినసాగాడు.

2

రూప పార్కులో అటూ ఇటూ అసహనంగా కదులుతూ వాచీ చూసుకుంది.

“అప్పుడే ఐదు నిముషాలు లేటు—” అని విసుక్కుంది. చుట్టూ చూసింది. దూరంగా చూడగలిగినంత వరకూ ఆమెకు కావలసిన వ్యక్తి కనబడడం లేదు.

రూప పార్కు బెంచీ మీద కూలబడి గతంలోకి వెళ్ళింది.

ఆ రోజు తను కాలేజీకి యెగేసి మ్యాట్నీకని వెళ్ళింది.

హాలుదగ్గర జనం కిటకిటలాడి పోతున్నారు. క్యూలలోకి అడుగుపెట్టే ప్రసక్తి లేదు.

ఆ రోజు సినిమా చూడాలని రూపకు కోరికగా ఉంది. సినిమాకని బయల్దేరి వచ్చి చూడకుండా వెళ్ళిపోవడం ఆమెకు అనుభవంలో లేదు. అయితే అప్పుడున్న పరిస్థితుల్లో ఏం చేయాలో ఆమెకు తోచడంలేదు.

సరిగ్గా ఆ సమయంలో ఒక వ్యక్తి ఆమెను పలకరించాడు—“సినిమాకు టికెట్లు కావాలా మేడమ్?”

ఆమె ఉలిక్కిపడి అతన్ని చూసింది. ఆ పలుకులు

అమృతోపమానంగా తోచాయా మెకు. "ఏమిటన్నారూ?" అంది నమ్మలేక.

అతను తన ప్రశ్నను రిపీట్ చేశాడు.

"కావాలి—" అందామె ముక్తసరిగా.

"సినిమాపిచ్చిని నేను అర్థం చేసుకోగలను. ఏదో పని మీద పోతూ యథాలాపంగా యిక్కడ మిమ్మల్ని చూశాను. మీ కళ్ళు చూస్తూనే మీ ఆవేదన అర్థం చేసుకున్నాను. నాకూ సినిమా పిచ్చి ఉంది లెండి. కావాలంటే మీకు టికెట్ తెచ్చిపెట్టగలను—" అన్నాడతను.

అతనివంక పరీక్షగా చూసిందామె. మనిషి అందంగా ఉన్నాడు. సన్నగా, పొడుగ్గా, నాజూగ్గా, ఆకర్షణీయంగా ఉన్నాడు. ఆమె వయసు అమ్మాయిలతన్ని మోసగాడని అనుకునేలా లేదు వేషం.

సందేహించకుండా ఓ యాభై రూపాయలనోటు తీసి అతనికిచ్చి—"చిల్లర లేదు మరి—" అంది. అతనా నోటు అందుకొని జనసమూహంలో కలిసిపోయాడు.

నిజానికామెవద్ద చిల్లర ఉంది. కానీ అతని వేషాన్ని చూసి ఆమె చిన్నబోయి ఇవ్వడానికి తటపటాయించింది. కావాలని టికెట్స్ తీసిపెడతానని అన్న అతన్ని తను అనుమానించడం లేదనడానికి నిదర్శనంగా ఆమె ఆ పెద్ద నోటును యిచ్చింది. అతను మోసం చేస్తే ఆమెకు అర్థికంగా పెద్ద నష్టమేమీ ఉండదు. జీవితంలో అదో అనుభవ మవుతుంది. లేదూ టికెట్ దొరుకుతుంది.

ఆమె ఆలోచనలింకా సగంలో ఉండగానే అతను వచ్చి ఆమెకు నాలుగు పదులు తిరిగియిచ్చి—చేతిలో రెండు టికెట్సు పెట్టి "బ్లాకులో కొన్నాను. ఈ రోజు

బ్లాక్ ధర ఎక్కువగా ఉంది. నేను కొన్నవాడి దగ్గర ఇవి రెండే ఉన్నాయి. రెండూ పదిరూపాయల కిచ్చాడు. ఎన్ని టికెట్లు కావాలని మిమ్మల్ని ముందుగా అడగ లేదు. మీ వాటం చూస్తే యే ఫ్రెండ్స్ కోసమో ఎదురు చూస్తున్నట్లనిపించింది. జనం మూగేలోగా రెండు టికెట్లూ పట్టుకొచ్చేశాను—" అన్నాడు.

రూప అతనికి థాంక్స్ చెప్పి—"నేను సింగిల్ గా వచ్చాను. రెండో టికట్ నాకు అవసరం లేదు!—" అంది.

"అయితే యిలాగివ్వండి—అది యెవరికైనా క్లియర్ చేసేస్తాను—" అన్నాడతను.

ఆమె తడబడుతూ—"ఎందుకు? మీకు వేరే పనేమీ లేకపోతే, అభ్యంతరం లేదనుకుంటే—ఈ టికెట్ మీరే తీసుకోండి—" అంది. అయితే ఆమె మనసులో ఆలోచన వేరు. ఇతను చూడ్డానికి పెద్దమనిషిలా ఉన్నాడు. ఇతను తన పక్కన ఉంటే ఫరవాలేదు. లేకపోతే ఆ టికెట్ యే రౌడీ వెధవ చేతిలో పడుతుందో!

అతను ముందు తటపటాయించి—"సినిమాకని బయ లేరలేదు నేను. చిన్న పనికూడా ఉంది నాకు. కానీ మీ బోటివారి పరిచయం లభించడం చాలా అదృష్టం. మీ ఆహ్వానాన్ని కాదనలేను—" అన్నాడు.

ఇద్దరూ కలిసి సినిమా చూశారు. సినిమా కథ చాలా మామూలు కథ.

ఒక గొప్ప ధనవంతుడికి అప్సరసల్లాంటి యిద్దరు కూతుళ్ళు. పెద్దమ్మాయికి పేదవాళ్ళంటే అసహ్యం. చిన్నమ్మాయికి వాళ్ళంటేనే యిష్టం. తమ తమ అభి

రునుల మేరకు వాళ్ళిద్దరూ ప్రేమించి పెళ్ళిళ్ళు చేసుకుంటూరు. తండ్రి రెండో అమ్మాయిని అసహ్యించుకుని ఇంట్లోంచి గెంటేస్తాడు. కానీ కథ ముగిసేసరికి పెద్దమ్మాయి మొగుడు జైల్లో ఉంటాడు. రెండో అమ్మాయి మొగుడు హైదరాబాదులో పెద్ద మేడ కొని హాయిగా ఉంటాడు. సినిమా అంతా పేదవాళ్ళని పొగడ్డంతోనే సరిపోయింది.

ఈ కథ రూపపైన కొంత ప్రభావం చూపించక పోలేదు. ఆమె అతని వివరాల నడిగింది.

అతను ఉత్సాహంగా ఆమెకు తన గురించిన వివరాలు చెప్పాడు.

అతని పేరు చంద్రశేఖరం. అతను చదువుకున్న అందమైన పేదవాడు. నిరుద్యోగి. సినిమాలో ఇలాంటివాళ్ళనే పొగడ్డం జరిగింది. అందువల్లనే అతనామె కుత్సాహంగా తన వివరాలు చెప్పాడు. అందమైన ధనిక యువతి ముందు యే యువకుడూ తన పేదరికాన్ని మరో పరిస్థితిలో అయితే అంగీకరించడు.

అప్పటికి వాళ్ళిద్దరూ విడిపోయారు కానీ ఓ రెండ్రోజుల తర్వాత చంద్రశేఖరం ఆమెను ప్రత్యేకంగా కలుసుకొని ఆమెకు పదిరూపాయలు యిచ్చి—"మగవాడినై ఉండి మీ డబ్బుతో సినిమా చూసినందుకు చాలా బాధపడ్డాను. ఇది తీసుకొని నాకు సంతృప్తి కలిగించండి—" అన్నాడు.

మొదట వద్దన్నా ఆ డబ్బు తీసుకోక తప్పలేదు రూపకు. అప్పుడు చంద్రశేఖరం తన గురించిన నిజాలు మరికొన్ని చెప్పి ఆమెకు విస్మయం కలిగించాడు.

ఆరోజు రూపను చూస్తూనే అతను ప్రేమించేశాట్ట.

ఆమెతో యేదో విధంగా పరిచయం సంపాదించాలను కున్నాట్ట. కావాలనే సినిమా టికెట్లు రెండు కొన్నాట్ట. సమయానికి జేబులో డబ్బు లేనందుకు బాధపడ్డాట్ట. ఆ బాధ ఇప్పుడు తీరింది.

ఈ వివరాలన్నీ చంద్రశేఖరం చక్కటి పద్ధతిలో చెప్పాడు. అతని మాటలు, మాట్లాడే పద్ధతి కూడా రూపకు నచ్చాయి. అప్పుడే ఆమెకు అతనిపై ప్రేమ అంకురించింది. తన మనసులోని భావాన్ని ఆమె కూడా అతనికి చెప్పింది.

"మీతో కలిసి ఆ సినిమా చూడడం చాలా మంచి దైంది. అందువల్లనే నా మనసు మీపైకి మళ్ళింది. నాకూడా డబ్బున్నవాళ్ళంటే అసహ్యమే! నేను డబ్బున్నదాన్నే కావచ్చు. కానీ మా ఇళ్ళలో ఆడదానికున్న నీతి మగాడి కుండదు. అన్నిరకాల అలవాట్లూ ఉంటాయి వాళ్ళకు. వాళ్ళను చేసుకుని యే ఆడపిల్లా సుఖపడలేదు. ఆడదాన్ని విలాస వస్తువుగా కాక ప్రేమస్వరూపిణిగా గుర్తించే మంచి మనసు పేదవాళ్ళలో తప్ప ఉండదు" అంది రూప.

ఇద్దరికీ పరిచయం ముదిరింది. పరిచయంతోపాటు ప్రేమ కూడా ముదిరింది.

రూప, చంద్రశేఖరం రోజూ పార్కులో కలుసుకుని భవిష్యత్తు గురించి యెన్నో కలలు కంటూండేవారు. రూప మనసులో తను సినిమాలో చూసిన ధనవంతుడి రెండో కూతురు మెదుల్తోంది. అందుకు కారణాలు లేక పోలేదు.

చంద్రశేఖరం, రూప—ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్నారు. రూపకు అతని సామర్థ్యంపైన బాగా

నమ్మకం కలిగింది. చంద్రశేఖరం ఆలోచనలు కేవలం ఉద్యోగంచుట్టూ పరిభ్రమించడంలేదు. అతని బుర్రలో వ్యాపారానికి సంబంధించిన ఎన్నో ఆలోచనలున్నాయి. సరైన పెట్టుబడి లభిస్తే అతను వో యేడాదిలోనే తనూ స్వంతంగా హైదరాబాదులో వో మేడ కట్టగలడు.

అతను పేదవాడు కాబట్టి మంచివాడయుంటాడని రూప అనుకొంటోంది. అయితే యెల్లకాలమూ అతను పేదవాడుగా వుండడం యిష్టంలేదు. ధనికులు దుర్మార్గులని అంగీకరిస్తూనే ఆ ధనికులు కావడమే తమ లక్ష్యంగా కానున్న ఆ దంపతులు భావిస్తున్నారు.

నిన్నటి రోజున రూప యింట్లో పరోక్షంగా ఇలాంటి పెళ్ళి ప్రసక్తి తీసుకువచ్చింది. ఇంట్లో ఒక్కరు కూడా యీ పెళ్ళికి అనుమతించేలా కనబడలేదు. తండ్రి, తల్లి, అన్న—అందరూ పేదవాళ్ళను బాగా అసహ్యించుకుంటున్నారు. తను చంద్రశేఖరాన్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటే యిల్లు వదిలిపెట్టి అతనితో వెళ్ళిపోవాలి. అంతకుమించి వేరే దారిలేదు.

ఇప్పుడు రూపకు యేమీ పాలుపోవడంలేదు. ఆమె త్రికరణశుద్ధిగా అతన్ని ప్రేమిస్తోంది. అతను లేని జీవితాన్ని ఊహించుకోలేక భయపడుతోంది. ఇందుకు ఏదో దారి చంద్రశేఖరమే చూపించాలి.అతనే తనకు ధైర్యాన్ని ప్రసాదించాలి.

అతనికోసం ఎదురుచూస్తూ మాటిమాటికీ వాచీ చూసుకుంటోంది రూప.

సాధారణంగా రోజూ కలుసుకొనే టైముకి అర్ధగంట ఆలస్యంగా వచ్చాడు చంద్రశేఖరం.

"అమ్మయ్య, వచ్చావా?—అసలు రావేమోనను కున్నాను—" అంది రూప అతన్ని పలకరిస్తూ.

"అనుకోని ఆలశ్యమైంది. వచ్చినట్టే వచ్చి ఓ ఆఫర్ ఎగిరిపోయింది—" అన్నాడు చంద్రశేఖరం. అతని కళ్ళలో నిరుత్సాహం కొట్టొచ్చినట్లు కనబడింది.

"ఏమిటది?"

"ఒకతను నన్ను చూసి చాలా ఇంప్రెస్ అయ్యాడు. కానీ...."

"ఎవరతను? వివరంగా చెప్పు...."

"ఈ ఊళ్ళోనే ఓ చిన్న ఇంటర్వ్యూకి వెళ్ళాను. ఇంటర్వ్యూల కెళ్ళడం బాగా అలవాటైంది కాబట్టి ధైర్యంగా జవాబులిచ్చాను. నాకు ఉద్యోగం రాలేదని అక్కడే చెప్పేశారు కానీ ఇంటర్వ్యూ బోర్డులో ఉన్న ఒకతను—ఇంటర్వ్యూ కాగానే బయటకు వచ్చి నన్ను పలకరించి—'నీ సమాధానాలు నాకు నచ్చాయి. నీ ఆరతలు కూడా బాగున్నాయి. నేను కొత్తగా వ్యాపారం ప్రారంభిద్దామనుకొంటున్నాను. అది నీ వల్లనే అవుతుందనిపిస్తోంది. సరిగ్గా నాలుగ్గంటలకి కనబడు—' అన్నాడు.

అతను చెప్పినట్లుగానే నాలుగ్గంటలకు కలుసుకున్నాను. అతను నాతో కాసేపు మార్కెట్లో కొన్ని వస్తువులకున్న డిమాండూ, ప్రస్తుతం ఉన్న సరఫరా—వగైరాల గురించి చర్చించి నా వ్యక్తిగత విషయాల గురించి అడిగాడు. చెప్పాను. పెళ్ళయిందా అనడిగాడు. లేదన్నాను. ఇప్పట్లో చేసుకోవద్దన్నాడు. నేను వెంటనే మన ప్రేమ విషయం చెప్పాను. నీ పేరు వింటూనే ఎందుకో ఉలిక్కిపడ్డాడు. మరి కొన్ని వివరాలడిగాడు.

అన్నీ విని—"రూప నాకు తెలుసు. ఆమె ప్రేమను పొందిన నువ్వు చాలా అదృష్టవంతుడివి. అయితే నేను వెతుకుతున్న వ్యక్తివి నువ్వుకాదు. నా వ్యాపారంలో అడుగిడబోయేవాడు కనీసం నాలుగైదేళ్ళవరకూ పెళ్ళి గురించి ఆలోచించకూడదు. కాబట్టి అయాం సారీ" అన్నాడు.

వెంటనే నేనూ నిరుత్సాహంగా లేచి నిలబడ్డాను. "అయితే పెళ్ళికే ప్రాముఖ్యత నిచ్చి వెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నావన్నమాట. నీ ఖర్మ! ఇంకా కొద్దిరోజుల గడువు అడిగి మళ్ళీ ఆలోచించుకు వస్తావేమో నను కున్నాను—" అన్నాడతను. అనగానే మొహమాటం వేసి—"గడువు లేదేమోననుకున్నాను! ఓ వారంరోజులు గడువు యివ్వండి, మిమ్మల్ని మళ్ళీ కలుసుకుంటాను" అని చెప్పి యిలా వచ్చేశాను. అందుకే ఆలస్యమైంది—" అన్నాడు చంద్రశేఖరం.

"అయితే యేం నిర్ణయించుకున్నావ్?" అంది రూప కంగారుగా.

"నిన్ను కాదని నేనేం నిర్ణయించుకోగలను? అంతా నీ యిష్టం!" అన్నాడు చంద్రశేఖరం.

రూప ఆలోచించింది. ఇందుకు తా నంగీకరిస్తే మరో నాలుగైదేళ్ళపాటు వివాహం జరుగదు. అంతకాలం తన వివాహం ఆగదు. ఇంట్లోవాళ్ళని అంతకాలం ఆపడం కష్టం. అలాగని ఇప్పుడు చంద్రశేఖరాన్ని పెళ్ళాడితే తన కాళ్ళమీద తను నిలబడే అవకాశం అతనికి పోతుంది. మళ్ళీ యిలాంటి అవకాశం అతనికి వస్తుందో, రాదో....!

"ఇంతకీ నీకిలాంటి అవకాశమిస్తానన్న ఆ పెద్దమనిషి ఎవరు?"

చంద్రశేఖరం పేరు చెప్పలేదు—"సమయం వచ్చినప్పుడెలాగూ తెలుస్తుంది. అతను తన పేరు ఎక్కడా చెప్పొద్దన్నాడు. నీకు చెప్పకూడని రహస్యం కాదుగానీ నీక్కూడా చెప్పకుండా ఉన్నప్పుడేకదా—నా నిజాయితీ బయటపడేది!" అన్నాడు.

ఆ పేరు గురించి రూప నొక్కించలేదు. ఆమె ఆలోచనలన్నీ వేరే ఉన్నాయి. వాటిలో పూర్తిగా తన భావి జీవితం మెదుల్తోంది. ఇప్పుడేం చేయాలి?

ఇంట్లో పరిస్థితుల్ని ఆమె అతనికి వివరించి చెప్పింది.

చంద్రశేఖరం మొహం పాలిపోయింది.

"ఏ ఆధారమూ లేనివాణ్ని నిన్ను నా పేదరికంలోకి యెలా ఆహ్వానించను? నీకు కొన్ని కనీసపు సౌకర్యాలన్నా కూర్చగల స్థాయికి చేరుకొంటే తప్ప మన పెళ్ళి జరగదు—" అన్నాడు చంద్రశేఖరం.

"నీకొక బంగారంలాంటి అవకాశం వచ్చింది. నా కారణంగా నీకు అది పోతే—అంతకంటే ఉచ్చదశకు వెళ్ళగల స్థితి యేర్పడాలి. అలా జరిగితేనే నాకూ తృప్తిగా ఉంటుంది. నేను నిన్ను మనసారా ప్రేమించాను. నువ్వు లేకుండా నా ముందు జీవితం చీకటిమయంగా కనబడుతుంది. నీకోసం నేనూ యేదో వొక యేర్పాటు చేయాలి గదా—అందుకు నాకు కొంత వ్యవధి కావాలి. ఎంతో వద్దులే—వారం రోజులలోపే!" అంది రూప.

"నువ్వు నాగురించి ఆలోచిస్తున్నావు. నేను నీగురించి ఆలోచిస్తున్నాను. మనిద్దరికీ దంపతులుగా సుఖపడే రాత

నిజంగా ఉందో లేదో తెలియదు—" అన్నాడు చంద్రశేఖరం బాధగా.

"అలా నిరుత్సాహపడకు—" అంది రూప. కానీ ఆమెకూడా కాస్త నిరుత్సాహంగానే ఉంది.

3

"హలో!" అంది రూప.

"నేను—కృష్ణారావుని మాట్లాడుతున్నాను —" అంది అవతలి కంఠం.

"నువ్వా?" అంది రూప.

"అవును. నేనే. కంగారుపడి ఫోన్ పెట్టేసేయకు. చాలా ముఖ్యమైన విశేషం చెప్పాలి నీకు—"

"చెప్పేసెయ్ త్వరగా. అవతల నాకు చాలా పెద్ద పనుంది—" అసహనంగా అంది రూప.

"ఎంత పెద్ద పనున్నా సరే నువ్వు కాస్త సహనం చూపక తప్పదు. ఇది నీ జీవితానికి సంబంధించిన విషయం" అన్నాడు కృష్ణారావు.

"సరే వింటున్నాను— చెప్పు—"

"ఇది ఫోన్లో చెప్పే విషయంకాదు. స్వయంగా చెప్పాలి—" అన్నాడు కృష్ణారావు.

"ఎలా కుదురుతుంది? ఇప్పుడు మనమున్నది ఫోన్ దగ్గర—"

"నీ వెటకారం అర్ధమయిందిలే—ఫోన్లో తప్ప నాతో స్వయంగా మాట్లాడే తీరిక లేదంటావ్? అయినా ఫరవాలేదు. అంతగా ఫోన్ దగ్గరే మాట్లాడాలనుకుంటే నేనిప్పుడే మీ యింటికి బయల్దేరి వస్తున్నాను. నా మాటలు లెక్కచేయక నిర్లక్ష్యంగా వెళ్ళిపోయావా చాలా విచారించవలసిన విషయం జరుగుతుంది. అందుకని

అలాంటి పని మాత్రం చేయకు—" అంటూ అవతల అతను ఫోన్ పెట్టేశాడు.

రూప ఫోన్ పెట్టేసి అసహనంగా అటూ యిటూ కదిలి అక్కడున్న సోఫాలో కూర్చుంది.

కృష్ణారావు తన్ను ప్రేమించాడు. కృష్ణారావంటే యింట్లోవాళ్ళందరికీ ఇష్టం. అందుక్కారణాలు వివరించ కల్లేను. కృష్ణారావు తనకు మంచి జోడీ. పైగా బోలెడు డబ్బూ, సంఘంలో ప్రతిష్ఠా ఉన్నవాడు.

కానీ తను అతన్ని నిరాకరించింది. అతనిలో తనకు నచ్చే లక్షణాలు లేవు. ఆడది అతనికి విలాసవస్తువు. అతను క్లబ్బులకు వెళ్ళి కేబరే డ్యాన్సులు చూసివస్తాడు. సిగ్గులేకుండా ఆ వివరాలు తనకు చెప్పబోతాడు. తను వినదు. అవన్నా అవి చూసేవాళ్ళన్నా తనకు అసహ్యమని చెప్పింది. నీకోసం అవన్నీ వదిలేస్తానన్నాడు. ఆ మాటలు నమ్మకల్లేదు. ఒకసారి పెళ్ళయ్యాక తను అతనికీ, అతని డబ్బుకూ, పేరు ప్రతిష్ఠలకూ బానిస. అతనిపై తనకు అదుపుండదు.

తను కోరుకునే జీవితం వేరు. తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ—సినిమాలోని హీరోహీరోయిన్‌లలా గడపాలని ఉంటుంది తనకు. పేదవాళ్ళయితే అలా ఉండగలరన్న ఆమె అనుమానం క్రమంగా నమ్మకంగా మారిపోయింది. ఇప్పుడు చంద్రశేఖరాన్ని ప్రేమిస్తోంది కాబట్టి అన్ని సమస్యలూ తీరిపోయాయి.

ఇంట్లోవాళ్ళకి బుద్ధిలేదు. ఆ కష్ణారావునింకా ఇంటికి రానిస్తున్నారు. అతను తనకోసమే వస్తాడు. ఇష్టం లేకపోయినా కాసేపు మాట్లాడి వెడతాడు.

ఏమి చెబుతాడో అన్న కుతూహలంకొద్దీ రూప యింట్లో అతనికోసం యెదురుచూసింది.

కృష్ణారావు వచ్చి—"ఫోన్ దగ్గరే మనం కలుసుకుంటున్నాం. ఓ. కే—" అన్నాడు.

రూప టైము చూసుకుని "త్వరగా చెప్పు" అంది.

"నువు నన్ను పెళ్ళిచేసుకోవాలి" అన్నాడు కృష్ణారావు వెంటనే.

"అది ఈ జన్మకు జరగదు" అంది రూప తడుముకోకుండా.

"అయితే వెంటనే నువ్వు రెండో జన్మ ఎత్తాల్సొంటుంది."

"అంటే?"

"సరిగ్గా వారంరోజులు గడువిస్తున్నాను. ఆ వారం రోజుల్లో నీ నిర్ణయం మారకపోతే ఈ జన్మ యిప్పటికి చాలిస్తావు" అన్నాడు కృష్ణారావు.

"నా చావు పుట్టుకలు నీ చేతుల్లో వున్నట్లు మాట్లాడు వున్నావ్" అంది రూప కోపంగా.

"నా చేతుల్లోనే వున్నాయి మరి. ఈ జన్మలో పుట్టుకకు కారణం నేనుకాదు. కానీ నీ చావుకు మాత్రం నేను ఏర్పాట్లు చేస్తున్నాను. ఏర్పాట్లు చాలా పకడ్బందీగా జరుగుతున్నాయి. నిన్నెవరు చంపారో, ఎందుకు చంపారో ఎవ్వరికీ తెలియదు. ఆ విధంగా నువ్వు తనువు చాలిస్తే అప్పుడు నా కోసం నువ్వింకో జన్మ ఎత్తాలిగదా! ఆ విధంగా నీ పుట్టుకకు కూడా నేను కారణమవుతాను" అన్నాడు కృష్ణారావు.

"నేను మళ్ళీ పుడితే పెరిగి పెద్దయ్యేసరికి ముసలాడివై పోతావ్" అని నవ్వింది రూప.

"ఆ లెక్కలన్నీ చూసుకున్నాను. ఇప్పుడు నాకు పాతికేళ్ళు. నువ్వు చచ్చేది వారం రోజుల్లోనే కదా— అంటే నువ్వు మళ్ళీ పుట్టి పదిహేనేళ్ళ దానివయ్యేసరికి నలభైఏళ్ళవాడినౌతాను నేను. ఈ రోజుల్లో పెళ్ళికి అదో పెద్దవయస్సు కాదు. ఎన్టీ రామారావు శ్రీదేవిలో వేస్తే విరగబడి చూసే ఈ జనం-మన జంటని తప్పక అభినందిస్తారు. అంతవరకూ నేను పెళ్ళి చేసుకోకుండా కేబరే డ్యాన్సర్లతో సరిపెట్టుకుంటాను" అన్నాడు కృష్ణారావు.

రూప అతని వంక చూసింది. అతని ముఖం చాలా సీరియస్‌గా వుంది.

"ఇదేం ప్రేమ? పెళ్ళి చేసుకోకపోతే చంపేస్తావా?" అంది రూప.

"నా ప్రేమ అలాగే వుంటుంది. ఇది చెప్పడానికే వచ్చాను. అవతల నీకు చాలా అర్జంటు పనులున్నాయి కాబోలు వెళ్ళు. నేనూ వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు కృష్ణారావు.

అతను వెళ్ళిపోగానే వాచీ చూసుకుంది రూప. పదకొండో తేదీ చూపిస్తోంది వాచీ. అంటే సరిగ్గా పదెనిమిదో తేదీనాటికి తను కృష్ణారావుని పెళ్ళి చేసుకుందుకు నిర్ణయించుకోకపోతే ప్రాణాలు కోల్పోతోంది. అందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయంటున్నాడు. నిజమా? అయితే అవి ఎలాంటి ఏర్పాట్లు?

4

"ఇప్పుడింకో కొత్తసమస్య వచ్చిపడింది—" అంది రూప.

"ఏమిటది?" అన్నాడు చంద్రశేఖరం.

రూప, కృష్ణారావు గురించి చెప్పింది.

కృష్ణారావు పేరు వింటూనే చంద్రశేఖరం భయ పడ్డాడు "అతను నాకు తెలుసు. చాలా ప్రమాదకరమైన మనిషి!"

"అందుకే అతనంటే నేనిష్టపడలేను. ఇప్పుడు నీకూ నాకూ వారంరోజుల గడువు వొచ్చింది. ఆలోచించుకునే టంగుకు టయింలేదు. ఇంతవరకూ మన వ్యవహారం ఎవ్వరికీ తెలియకుండా రహస్యంగా వుంచగలిగాను. అది ఏ మాత్రం బయటపడినా నా పెళ్ళి బలవంతంగా కృష్ణా రావుతో జరిగిపోతుంది. నేను నీలాంటి పేదవాణ్ణి చేసు కుందుకు సిద్ధపడితే యింతకాలం మా యింట్లో నాపైన వున్న గౌరవం పోతుంది. నా ఇష్టాన్ని లక్ష్యపెట్టడం మానేస్తారు!" అంది రూప.

"అయితే ఏంచేద్దాం?"

"చేయడానికేమీ లేదు. మనిద్దరం కలిసి యీ ఊరు విడిచి పెట్టేసి మరెక్కడికైనా వెళ్ళి పెళ్ళి చేసేసు కుందాం" అంది రూప.

ఇబ్బందిగా మొహంపెట్టాడు చంద్రశేఖరం "అప్పుడు అటు కృష్ణారావూ, ఇటు మీ నాన్నా కలిసి వేటాడి మనిద్దర్నీ చంపేస్తారు."

"అలాంటి ప్రమాదమేమీ వుండదు. మనం కాస్త ధైర్యం వహించాలి. అంతే! ఒకసారి మన పెళ్ళి జరిగాక చూస్తూ చూస్తూ మా నాన్న మనని కాదనలేడు. అంతగా అయితే నేను తన కూతుర్ని కాదంటాడు తప్పితే వేటాడ లేడు. ఎటొచ్చీ కృష్ణారావు కాస్త ప్రమాదకరమైన మనిషి. నన్నుచంపడానికిప్రయత్నాలారంభించానన్నాడు.

ఏవో ఏర్పాట్లు చేశానన్నాడు. అవేమిటో తెలియదు. ఆ మాటల్లో నిజమెంతుందో తెలియదు. కొంతకాలం ఆచూకీ దొరక్కుండా జాగ్రత్తపడితే ఆ వేడి అదే చల్లారుంది" అంది రూప.

"సరే మనం ఇల్లు వదిలిపెట్టాం. ఎక్కడికని వెళ్తాం. ఎక్కడికో అక్కడికి వెళ్ళామనుకో-ఎలా బ్రతుకుతాం?" అన్నాడు చంద్రశేఖరం బాధగా.

"నువ్వు మగాడివి. నిన్ను నమ్ముకుని తనవాళ్ళందర్నీ వదులుకుని వస్తున్న ఆడదానికా మాత్రం ఆసరా యివ్వలేవా?" అంది రూప నొచ్చుకుంటూ.

చంద్రశేఖరం తడబడలేదు "నేను నిన్నెంతగా ప్రేమించానో, ప్రేమిస్తున్నానో నీకర్థం కాదు. నా బాధ నీకర్థం కానిది. ఎండ కన్నెరుగని సుకుమారివి. ధనవంతుల అల్లారు ముద్దుబిడ్డవు. అలాంటి నిన్ను నడివీధిలో నిలబెట్టే సితికి తీసుకురాలేను. నిన్ను చూసుకునేందుకు ఒక కనీసపు స్థాయి వుండాలి. ఆ స్థాయికి ఆరంభంలో ఓ గవర్నమెంటు ఉద్యోగమైనా వుండాలి. ఒకటి రెండు లక్షల రూపాయల క్యాషైనా వుండాలి. ఈ రెండింట్లో యేదో ఒకటి లేకుండా నేను నిన్ను పెళ్ళిచేసుకోవడం కల్ల—"

"ఆ కారణంగా నేను నీకు శాశ్వతంగా దూరమైతే!" అంది రూప.

"నువ్వు సుఖంగా వుండమే నాక్కావలసింది. నీ సుఖంకోసం నీకు దూరమైనా బాధపడను. కానీ నిన్ను నా జీవితంలోకి ఆహ్వానించి బాధలకు గురిచేయలేను" అన్నాడు చంద్రశేఖరం విచారంగా.

"నీతోడి నరకమైనా నాకు స్వర్గమే! నీకు దూరంగా

వుంటే సుఖమనే పదం నన్ను దరిచేరడం అసాధ్యం"
అంది రూప ఆవేశంగా.

"ఆవేశాలు తాత్కాలికం రూపా! ఈ రోజున్న ఈ ఆవేశం రేపుండదు. మన ముందున్నది నూరేళ్ళ జీవితం. వేసే ప్రతి అడుగూ చాలా ఆలోచించి వేయాలి!"అన్నాడు చంద్రశేఖరం.

"అయితే మన పెళ్ళి జరగదా?" అంది రూప.

"ఎందుకు జరగదు? నాలుగైదు రోజుల్లో ఒకటి రెండు లక్షలు సంపాదించగలగాలి. అందుకు నా శాయశక్తులా ప్రయత్నిస్తాను...." అన్నాడు చంద్రశేఖరం.

"అంత తక్కువ వ్యవధిలో అంత డబ్బు ఎలా కూడ బెట్టగలవు? నిజంగా కూడబెట్టగలిగే శక్తి వుంటే నన్ను పెళ్ళి చేసుకున్నాక మాత్రం అదెందుకు సాధ్యపడదు?" అంది రూప.

"నీకు తెలియదు రూపా! ఇప్పుడున్న విల్ పవర్ (Will power) అప్పుడుండదు. ఏం చేసినా పెళ్ళికి ముందే చేయాలి" అన్నాడు చంద్రశేఖరం.

"నీ మాటలు నిజమే-ఈ విషయమై నేనూ ఏదో ఒకటి చేయాలి. ఈ పెళ్ళికోసం నేను ఏమైనా చేయగలను. నా ప్రయత్నాలు నేను చేస్తాను. నీ ప్రయత్నాలు నువ్వు చేయి. కాస్త ఆ కృష్ణారావును కనిపెట్టివుండు. అతను నా గురించి ఎటువంటి ఏర్పాట్లు చేస్తాడోనని భయంగా వుంది" అంది రూప.

5

జ్యోతిష్కుడి వద్ద జనం చాలామంది వున్నారు.

"చాలా సేపట్నుంచిక్కడ ఉన్నావు. నీ చేయి

చూపించు నాయనా!" అన్నాడు జ్యోతిష్కుడు సాదరంగా.

అయితే అతను చేయి చూపించలేదు "నేను మీతో ప్రత్యేకంగా మాట్లాడాల్సి వుంది. అందరి పనీ అయిపో నివ్వండి" అన్నాడు.

జ్యోతిష్కుడివద్ద జనం పూర్తికావడానికి రెండు గంటలు పట్టింది. అంతసేపూ అతను ఓపికగా ఎదురు చూస్తూనే వున్నాడు.

జ్యోతిష్కుడు సాదరంగా అతనివంక చూసి "ఇప్పుడు చెప్పు నాయనా" అన్నాడు.

"హస్తసాముద్రికం నమ్మదగ్గదే నంటారా" అన్నాడతను.

ఈ ప్రశ్నకు జ్యోతిష్కుడులిక్కిపడ్డాడు. అతను తనకు సంబంధించిన చిక్కులేవో అడుగుతాడని అనుకున్న జ్యోతిష్కుడి అంచనా తారుమారైంది.

"నమ్మదగ్గది కాదని నీకు అనుమానుమా?"

"ఊఁ" అన్నాడతను.

"ఎందుకు?"

"మనిషి భవిష్యత్తు అతడి చేతిలోని రేఖల్లో ఎందు కుంటుంది?" అన్నాడతను.

జ్యోతిష్కుడు నవ్వి "ఈ ప్రపంచంలో ఎన్నో వస్తు విషయ నిర్ణయాలు లక్షణాలపై ఆధారపడి వుంటు న్నాయి. మామిడిపండు ఆకు పచ్చగా వుంటే పచ్చిది. పసుపురంగులోకి మారితే పండు. మనిషిజుట్టు నల్లగా వుంటే పడుచువాడు. తెల్లబడితే ముసలివాడు. అలాగని ఆకు పచ్చగావుండే మామిడిపండ్లు లేకపోలేదు. పడుచు దనంలోనే జుట్టు నెరసినవాళ్ళు వుండకపోరు. అంత

మాత్రాన తెల్లజుట్టు ముసలితనానికి చిహ్నం కాదని అన లేము. కొందరు మహానుభావులు ప్రపంచంలోని ఎందరో మనుషుల హస్తరేఖలను గమనించి వాటి విశేషాలను తెలుసుకోగలిగారు. అవి చాలావరకూ నిజాలేనని నా అనుభవం చెబుతోంది. మనిషి స్వభావానికీ, భవిష్యత్తుకూ ఎంతో సంబంధముంది. హస్తరేఖలు మనిషి స్వభావాన్ని ప్రతిబింబింప జేస్తాయి. ఏదీ నీ చేయి జాపు!" అన్నాడు జ్యోతిష్కుడు.

అతని కళ్ళలో సంతృప్తి కనబడింది. అప్రయత్నంగా తన చేయి జాపాడు.

"ఆహా ఏమి హస్తం, దివ్య హస్తం!" అన్నాడు జ్యోతిష్కుడు.

అతని కళ్ళు వెలిగాయి. ఆత్రుతగా జ్యోతిష్కుడి వంకే చూశాడు. జ్యోతిష్కుడు అది గమనించి అదేపనిగా అతడి అదృష్టాన్ని, భవిష్యత్తునూ పొగడసాగాడు.

కాసేపు విన్నాక అతనికి విసుగుపుట్టింది. "నేను మీకు చేయి చూపించినది ఒక ముఖ్యవిషయం తెలుసుకుందుకు! అది మీరింతవరకూ చెప్పలేదు" అన్నాడు.

జ్యోతిష్కుడు తడుముకోకుండా "నేను నీ రేఖలు చూసి లక్షణాలు చెప్తున్నాను. నీ మనసులోని మాట చెప్పడంలేదు. అడేమిటో అడుగు, చేయి చూసి చెబుతాను" అన్నాడు.

అతను తటపటాయిస్తూ "నా చేతిలో దుష్టత్వాన్ని సూచించే రేఖలేమైనా కనబడుతున్నాయేమో చూడండి" అన్నాడు.

జ్యోతిష్కుడు శ్రద్ధగా చేతిని పరిశీలించి "దుష్టత్వ మని చెప్పలేను కానీ పెకిపోవడానికి నువ్వు నలుగురూ

అనుసరించని దార్లు అనుసరిస్తావు. నీకు మంచి తెలివి తేటలు, తెగువ వున్నాయి. కోరికలున్నాయి. రాజకీయ వాదులు అవినీతి, ఉద్యోగుల లంచాలు దుష్టత్వం అని పించుకుంటే నీలోనూ దుష్టత్వాన్ని చూపిస్తున్నాయ్ కొన్ని రేఖలు" అన్నాడు.

అతని ముఖంలో సంతృప్తి కనబడి అసాధ్యనే భయం ఆక్రమించుకుంది "శ్రద్ధగా చూడండి దుష్టత్వమంటే నా ఉద్దేశ్యం అదికాదు. నా స్వంత ప్రయోజనంకోసం గానీ, మరేకారణం చేతగానీ నేను ఇంకొకరి ప్రాణాలు తీయ గలనా? ఆ శక్తి నాలో వుందా? నేను హత్య చేస్తానన్న సూచనను నా చేయి చూపుతోందా?" అన్నాడు కంగారుగా.

జ్యోతిష్కుడి ముఖంలో కూడా భయం కనబడింది. మనిషి కొద్దిగా వణికాడు కూడా. మరోసారి జేయి పరీ క్షించి "నువ్వు హంతకుడివి కావు. నీ చేయి ఈ విష యాన్ని నిరూపిస్తోంది" అన్నాడు.

"అబద్దమాడకూడదు" అన్నాడతను.

"నేను రేఖలు చూసి చెబుతున్నాను. ఇందులో అబద్ధం ప్రసక్తిలేదు" అన్నాడు జ్యోతిష్కుడు హుందాగా.

"అయితే వినండి. నాకు ఇలాంటి జ్యోతిష్కుల మీద నమ్మకంలేదు. ఒక బలహీనమైన క్షణంలో మీ దగ్గరకు వచ్చాను. ఎందుకో మీ మాటలు నాలో నమ్మకం కలి గిస్తున్నాయి. మీకు నా ధన్యవాదాలు. ప్రస్తుతానికి ఈ పదిరూపాయలూ వుంచండి. మీరు చెప్పింది నిజమైతే మళ్ళీ మీ వద్దకు వచ్చి నూటపదహార్లు చదివించుకుంటాను. మీరు చెప్పింది అబద్ధమైతే మాత్రం నేను చేసే రెండవ హత్య మిమ్మల్నే!" అన్నాడతను.

జ్యోతిష్కుడి వేళ్ళు పదిరూపాయలను అందుకుంటూ వణికిపోయాయి.

అతను ఆ విషయం పట్టించుకోకుండా అక్కణ్ణించి కదిలి "గడువు దగ్గర పడుతోంది. హత్య చేయకుండా ఆ మనిషిని నేనెలా చంపగలుగుతాను? ఆ మనిషిని చంపి తీరాలన్న నా బాస్ నిర్ణయం మారుతుందా?" అని తనలో తానే గొణుకున్నాడు.

6

రెండ్రోజుల్నించి రూప ఇంట్లో శ్రద్ధగా తండ్రిననుసరించి తిరుగుతోంది. ఆయన వ్యవహారాలను కనిపెడుతోంది. డబ్బెక్కడుంటుందీ, నగలెక్కడుంటాయీ, తాళాలెక్కడుంటాయీ మొదలైన విషయాలన్నీ అంచనా వేసుకుని రెండులక్షలు కూడబెట్టడానికి తను యేమేం తీయాల్సివుంటుందో లెక్క వేస్తోంది.

ఇంట్లో దొంగతనం చేసి డబ్బు పట్టుకుపోవాలని ఆమె అనుకుంది.

ఆమె ఈ నిర్ణయానికి ఒకేఒక్క కారణం. అది చంద్రశేఖరం పైన ప్రేమ.

చంద్రశేఖరం అసహాయుడని ఆమెకు తెలుసు. మెహర్బానీకి పైకి ఏదో కబుర్లు చెప్పినా డబ్బు సంపాదించడం అతనివల్ల కాదని ఆమెకు తెలుసును. డబ్బు సంపాదించడం తనవల్లనే కావాలి. తనకూ వేరే దారి లేదు. ఇంట్లో దొంగతనం చేయాలి.

రూప ఇంట్లో తరతరాలుగా వస్తున్న బంగారు నగలున్నాయి. వాటి ఖరీదు ఆరేడు లక్షలకు తగ్గదని ఇంట్లో అంచనా. ఏ పరిస్థితుల్లోనూ యింట్లోవాళ్ళు వాటిని

వాడరు. గొప్పగొప్ప అతిథులు వచ్చినప్పుడు మాత్రం వాటిని చూపిస్తూంటారు. సాధారణంగా సంవత్సరానికి రెండు మూడుసార్లకు మించి వాటిని చూడడం కూడా జరుగదు. అవి ఇనప్పెట్టెలో భద్రంగా వుంటాయి.

వాటిని తీసుకువెళ్ళి చంద్రశేఖరానికివ్వాలని రూప నిర్ణయించుకుంది. అవి కాక రూపకున్న నగలవిలువ వేరే అరవైవేల వరకూ వుంటుంది. ఆ నగలు రూప కస్టడీలోనే వున్నాయి. పాతనగల్లో కొన్నీ, తన నగలూ కలిపితే చంద్రశేఖరం మంచి వ్యాపారాన్ని ప్రారంభించడానికి అవసరమైన డబ్బు సంపాదించవచ్చునని రూప అనుకుంది.

ఇనప్పెట్టె తండ్రి గదిలోనే వుంటుంది. ఆ గదిలో రాత్రి తల్లి, తండ్రి పడుకుంటారు. అందువల్ల రాత్రి దొంగతనం చేసే ప్రసక్తి లేనేలేదు. తాళాలు మంచానికున్న ఒక అరలో వుంటాయి.

దొంగతనం చేసే ఉద్దేశ్యంలో ఒక రోజల్లా రూప ఇంటిల్లపాదినీ గమనించింది. ఆ ప్రకారం ఉదయం పది కొండు గంటల ప్రాంతం దొంగతనానికి అనువైన వేళగా నిర్ణయించుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఇంకెవ్వరూ వుండరు. తల్లి పూజలో వుంటుంది.

ఇనప్పెట్టె ఎలా తెరవాలో ఆ రహస్యాలన్నీ రూపకు తెలుసును. లేకపోతే ఆ ఇనప్పెట్టెకు బర్గ్లర్ అలారం కూడా వుంది.

తను నిర్ణయించుకున్న సమయానికి రూప దర్జాగా ఒక చిన్న సూట్ కేస్‌తో తండ్రి పడకగదిలోకి వెళ్ళింది. ఇనప్పెట్టె తెరిచి తనక్కావలసిన ఆ పాత నగలను రహస్యపుటరలోంచి తీసి సూట్ కేసులోకి మార్చింది.

మళ్ళీ ఇనప్పెట్టె మూసేసి తాళాలు యధాస్థానంలో పెట్టేసింది. ఈ పని చేస్తున్నంతసేపూ ఆమె విపరీతంగా వణికిపోతూనే వుంది. అదుపు చేసుకుందామని ఎంత ప్రయత్నించినా వణుకు తగ్గలేదు.

తనింట్లో తనే దొంగతనం చేసింది!

ఆ సూట్ కేసు తీసుకు తన గదికెళ్ళింది. అప్పుడే తల్లి పెట్టిన కేక వినబడింది. సూట్ కేసును భద్రంగా దాచి తల్లి దగ్గరకు వెళ్ళింది. అప్పటికామె వణుకు అధికమైంది.

తల్లి ఆమెకు ఏదో పని పురమాయించబోయిందల్లా "అదేంటే అల్లా వణికిపోతున్నావ్" అంది.

తను వణకడం లేదని రూప ఇచ్చిన సమాధానం కూడా వణుకుతూనే వుంది.

తల్లి కంగారుగా "ఏమయిందే నీకు!" అంది.

రూపకు ఏం జవాబు చెప్పాలో తెలియలేదు. అలవాటులేని ఆ పని తనకు నరనరాల్లోంచీ వణుకు పుట్టిస్తోంది. చంద్రశేఖరంమీది ప్రేమలో ఆఖరికి తను దొంగతనం చేసేటంత నీచస్థితికి దిగజారిపోయింది. కాని ఈ దొంగతనం శాశ్వతం కాదు. వ్యాపారంలో తాము స్థిరపడ్డాక తాకట్టు పెట్టిన ఈ నగలన్నీ విడిపించి మళ్ళీ తండ్రికిచ్చేస్తాను. అంతవరకూ అవమానం భరించక తప్పదు.

రూప కాస్త సర్దుకొని— "తన్ను పెళ్ళాడనన్నానని కోపం వచ్చి ఆ కృష్ణారావు నన్ను చంపడానికి యేర్పాట్లు చేస్తున్నానన్నాడు. ఆ గడువు దగ్గరకొచ్చేసరికి భయం వేసింది" అంది.

రూప తల్లి నవ్వి— "ఏడిసినట్లే వుంది—కృష్ణారావు నిన్నలా బెదిరిస్తానని మా అందరికీ చెప్పే చేశాడు. అది మంచి సంబంధం. నువ్వో దారికి వస్తావన్న ఆశతో షే

పుతన్ని అలా చేయనిచ్చాం. ఈ మాత్రంపానికే ప్రాణ భయంతో వణికిపోవాలా? నా ప్రాణంలో ప్రాణానివి నువ్వు. నీకేదైనా కీడు రానిస్తానా?" అంది.

"అమ్మా—నన్నింతగా అభిమానిస్తున్నావు. నేను మీరు చెప్పిన సంబంధం కాదని పేదవాడిని కట్టుకుని యిల్లు వదిలిపెడితే—అప్పుడు కూడా ఇలా అభిమానించగలవా?" అంది రూప.

"కన్నతల్లి ప్రేమ యేమిటో నువ్వూ ఓ. బిడ్డ తల్లివైతే తెలుస్తుంది. నువ్వెక్కడున్నా నా అభిమానం అలాగే ఉంటుంది. ఎటొచ్చీ ఒకోసారి పరిస్థితులు అసహాయురాల్ని చేస్తే నేనేం చేయలేను. నాకు తెలియకుండా ఎవరైనా నీకన్యాయం తలపెడితే, అందుకు నువ్వు సహకరిస్తే నేను నిన్నెలా కాపాడగలను?"

తల్లి మాటలు రూపకు అర్థంకాలేదు. అదే తల్లికి చెప్పింది.

"మేము చెప్పినవాణ్ని నువ్వు పెళ్ళి చేసుకున్నావనుకో. నిన్ను కళ్ళల్లో వత్తులు వేసుకుని కాపాడుకోగలం. కానీ నీకు తెలిసినవాణ్నీ, మాకు తెలియనివాణ్నీ చేసుకున్నావనుకో. వాడు మంచివాడైతే ఫరవాలేదు. చెడ్డవాడైతే మేము చేయగలిగేదేమీ ఉండదు. అందుకే పెళ్ళికి పెద్దవాళ్ళమీద ఆధారపడాలి—"

"పెద్దలు చేసిన పెళ్ళిళ్ళెలా ఏడుస్తున్నాయో నేనూ చూశాలే—" అని రూప అక్కణ్నించి కదిలింది. ఇప్పుడు తను అర్జంటుగా చంద్రశేఖరాన్ని కలుసుకొని మాట్లాడాలి.

అర్జంటు పనులకు చంద్రశేఖరం ఆమెకో ఫోన్ నంబరిచ్చాడు. ఆ నెంబర్ చేసిందామె.

అదృష్టవశాత్తూ చంద్రశేఖరం వెంటనే దొరికాడు. లేకపోతే అతనికి మెసేజ్ యివ్వవలసి ఉండేది. చంద్రశేఖరం గొంతు వింటూనే ఆమె హుషారుగా—

"పార్కుకివచ్చేయ్. అర్జంటుగా నీతో మాట్లాడాలి—" అంది.

ఇద్దరూ పార్కులో కలుసుకొన్నారు.

"డబ్బు దొరికిందా?" అందామె.

"లేదు!" నీరసంగా అన్నాడు చంద్రశేఖరం.

"డబ్బు తేలిగ్గా దొరకదని నాకు తెలుసు. అందుకే నా ప్రయత్నాలు నేను చేశాను. యింక ధైర్యంగా ఉండు. మంచి ఆలోచన చెప్పు—" అంది రూప.

"డబ్బు నువ్వు తెస్తావా?" అన్నాడు చంద్రశేఖరం ఆశ్చర్యంగా.

"నీకోసం ఏమైనా తేగలను! ఏమైనా చేయగలను!!" అంది రూప.

"నిజంగా డబ్బు దొరికిందా?" అన్నాడు చంద్రశేఖరం యింకా ఆశ్చర్యాన్నుంచి కోలుకోకుండా.

"నీతో అబద్ధమాడ్డం నాకు సరదా అనుకున్నావా!" అంటూ రూప తను చేసిన పని వివరంగా చెప్పింది.

చంద్రశేఖరం రూపవంక ఆరాధనాపూర్వకంగా చూసి —"నీకు నామీద ఎంత ప్రేమ రూపా! ఈ ప్రేమకు నేను అర్హుణ్నో కానో కాలమే ఋజువు చేయాలి—" అన్నాడు.

"నీ అర్హతకు వేరే ఋజువులక్కర్లేదు. అది నేనే నాడో నిర్ణయించేశాను. ఇప్పుడు చర్చించాల్సిన విషయమదికాదు. ముందు సంగతి చెప్పు—" అంది రూప.

ఇద్దరూ కలిసి కాసేపు ఆలోచించారు.

"రూపా! నువ్వు అనుమానించవలసిన పరిస్థితులలో ఇల్లు వదిలి పెట్టకూడదు. అలాగైతే మీ అమ్మా నాన్నలకు అనుమానం వస్తుంది. దూరప్రాంతం పోయి వివాహం చేసుకునేంత వ్యవధి నాకుండదు. ఈలోగా నేను యేం చేయాలో నిర్ణయించుకొంటాను—రేపు సాయంత్రం ఆరు గంటలకు అశోకా హోటల్ కి రా. రేపు ఫోన్ చేసి నేను యే రూం బుక్ చేసిందీ చెబుతాను. గది నీ పేరున బుక్ చేస్తాను. అందులోకి వెళ్లి ఉండు. ఎనిమిది దాటేక నేనక్కడికి వస్తాను. వచ్చేముందు నా పేరు అశోక్ అని రిసెప్షనిస్టుకు చెబుతాను. అతను నీకు ఫోన్ చేసి నా పేరు చెబుతాడు. రమ్మను. ఇద్దరం అనుకున్న పథకం ప్రకారం అక్కణ్నించి యెగిరిపోదాం. నువ్వక్కడ నగలతో ఉంటావు. నేను మంచి తిరుగులేనిపథకంతో వస్తాను...." అన్నాడు చంద్రశేఖరం.

"అలాగే!" అంది రూప. ఎందుకో ఆమె శరీరం మళ్ళీ వణుకుతోంది.

7

స్నేహితురాలు శాంతను ఒప్పించగలిగింది రూప. ఆమె రూప యింటికి వచ్చి ఒక వారంరోజులపాటు తామంతా మహాబలిపురం ట్రిప్పు వేసుకున్నామనీ రూపను పంపించమనీ అడిగింది. పర్మిషన్ ఫార్మాలిటీయే అని రూపకూ తెలుసు. సాక్ష్యం కోసం శాంతను ఇంటికి తీసుకువచ్చింది రూప.

శాంత, మరి నలుగురు అమ్మాయిలు కలిసి నిజంగానే మహాబలిపురం ట్రిప్పు వేసుకున్నారు. ప్రయాణం శాంత కారులో! ఎటొచ్చీ ఆ ట్రిప్పులో రూప వెళ్ళదు.

రూప—శాంతకు చాలా థాంక్స్ చెప్పుకొంది. తన కోసం మహాబలిపురం ట్రిప్పు నిజంగానే వేసుకుంది. నిజంగా వేసుకోని పక్షంలో తను చంద్రశేఖరంతో లేచి పోయినందుకు శాంతకు చెడ్డ పేరు వస్తుంది. ఆమే సహకరించిందంటారు. ఇప్పుడైతే—చివరిక్షణంలో అది రానని వెళ్ళిపోయిందని అబద్ధమాడవచ్చు. ఆ విధంగా శాంతకు చెడ్డ పేరు రాదు. వచ్చే దంతా రూపకు మాత్రమే వస్తుంది.

"మర్చిపోకు-ఆరయ్యేసరికల్లా మా ఇంట్లో ఉండాలి" గుర్తుచేసి మరీ వెళ్ళింది శాంత. ఆమె అలా గుర్తుచేయడం రూప తల్లి కూడా వింది. వినాలన్నదే శాంత ఉద్దేశ్యం.

"విష్యూ బెస్టాఫ్ లక్—...." అంది శాంత వెళ్ళి పోతూ.

"మళ్ళీ యెప్పుడు కలుస్తామో—" అంది కన్నీళ్ళొత్తుకుంటూ రూప.

శాంత నవ్వి వెళ్ళిపోయింది.

రూప ఇంట్లో వస్తూండగా టెలిఫోన్ మ్రోగింది. రూప తల్లి ఫోన్ తీసింది.

"ముప్పైమూడు!" అన్నాడవతలి వ్యక్తి.

"హలో యెవరు మాట్లాడుతూంట....!" అంది రూప తల్లి.

అవతల క్లిక్కుమంది.

"ఏమిటమ్మా—" అనడిగింది తల్లిని రూప.

ఆమె చెప్పి—"యెవడో పిచ్చి వెధవలా ఉన్నాడు" అంది.

అది అశోకా హోటల్లో తన పేరున బుక్ అయిన గది నెంబరని గ్రహించింది రూప. చంద్రశేఖరం చాలా

తెలివిగా వ్యవహరిస్తున్నాడని ఆమె సంతోషించింది. ఫోన్ దగ్గరకు తనను పిలవమంటే అనవసరపు అనుమానా లకు దారి తీయవచ్చు.

తప్పు చేసేటప్పుడు మనిషి చాలా జాగ్రత్తగా ఉండాలి. అందుకే చంద్రశేఖరం జాగ్రత్త పడుతు న్నాడు. అయితే తాము చేస్తున్న తప్పేమిటి?

తప్పు కాకపోతే ఈ బెదురెందుకు?

ప్రేమించిన మనిషిని పెళ్ళాడ్డం తప్పుకాదు. తనింట్లో అది తప్పయింది. అందుకే ఆ తప్పుకోసం మరి కొన్ని తప్పులు చేయాల్సి వస్తోంది. ఈ తప్పులకు తనను తండ్రి క్షమిస్తాడో లేదో తెలీయదు. ఆ భగవంతుడి దృష్టిలో తను నేరస్థురాలు కాకపోతే అదే చాలు!

రూప ఆ రోజల్లా యింట్లో అసిమితంగా తిరిగింది. ఇంతకాలం తన దనుకున్న ఆ ఇంటితో తనకు ఋణం తీరి పోతోంది. మళ్ళీ ఆ యింట్లో అడుగుపెట్టే అవకాశం తనకు కలుగుతుందో కలగదో!

ఇంట్లోని అందరికీ తనపైన విపరీతమైన ప్రేమ వున్నదనీ - అందరు ప్రేమమూర్తులను వదులుకుని తను స్వార్థపూరితమైన ప్రేమకోసం యిల్లు వదిలిపెట్టడం న్యాయంకాదని ఆమెకు అనిపిస్తోంది.

అదే ఆమెకు ఆశ్చర్యంగాకూడా ఉంది.

నిన్నగాక మొన్న పరిచయమైన చంద్రశేఖరంకోసం తను జీవితంలో ఊహించని సాహసం చేస్తోంది. ఇందులో విశేష మేమిటి? అది వయసు బలమా?

సూట్ కేస్ తీసుకొని సాయంత్రం అయిదున్నరకు యిల్లు వదిలినప్పుడు రూపకు దుఃఖం ఆగలేదు. ఆమె

ఎందుకు యేడుస్తోందో అర్థంకాక తల్లి ఆశ్చర్యంగా చూసింది ఆమెవంక.

దుఃఖాన్ని దిగమింగుకుని పుట్టిల్లు వదిలిపెట్టిన కొత్త పెళ్ళికూతురిలా ఇల్లు కదిలింది రూప.

8

"బాస్ హత్య విషయంలో నీ నిర్ణయం మారలేదు కదూ!" అన్నాడతను.

"లేదు__గడువు కూడా పూర్తికావచ్చింది."

"అయితే వెడుతున్నాను...." అన్నాడతను నిస్పృహగా.

"వెళ్ళు. నీకు శుభమవుతుంది_" అన్నాడు బాస్.

"ఇకమీదనుంచి హత్యలే నాకు జరిగే శుభం!" అని అస్పష్టంగా గొణుక్కున్నాడతను.

"అయితే బయల్దేరుతున్నావా?"

"ఊఁ."

"అశోకా హోటల్ కేనని గుర్తుందా?"

"ఉంది__"

9

రూప వాచీ చూసుకుంది.

టైము ఎనిమిదయింది. ఆమె అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తూ__"వస్తానన్న మనిషి అన్న టైముకు కాస్త ముందు వస్తే ఎంత బాగుండేది?" అనుకొంది.

ఆమె అటూ ఇటూ తిరుగుతుండగా గదిలో యేదో క్రిందపడ్డ చప్పుడు వినిపించింది. ఉలిక్కిపడి అటు చూసింది. మంచానికి దగ్గరగా ఉన్న టీపాయ్ పైన తను మంచినీళ్ళు తాగి ఉంచిన స్టీలుగ్లాసు క్రింద పడింది.

అది తనంతట తను క్రింద యిలా పడింది?

రూప ఓసారి పైక చూసి వేగంగా తిరుగుతున్న ఫాన్ వంక చూసుకొని—"అది మరీ వేగంగా తిరుగు తూంటే—బల్లలే యెగిరిపోవాలి—గ్లాసేక లెక్కా—?" అనుకొంది.

సరిగ్గా అప్పుడే గదిలోని యింటర్ కామ్ మ్రోగింది. ఆమె వెళ్ళి ఫోన్ తీసింది.

అంతా అనుకొన్నట్టే జరుగుతోంది. అశోక్ పేరు వినగానే ఆమె పంపించమని చెప్పింది.

ఫోన్ క్రింద పెట్టేసి గది తలుపులు తీసి ఓర వాకిలిగా ఉంచింది. తను వెళ్లి మంచానికి పక్కగా ఉన్న సోఫా పైన కూర్చుని అడుగుల చప్పుడు కోసం యెదురు చూస్తోంది.

సరిగ్గా అయిదు నిముషాల్లో ఆమెకు గుమ్మందగ్గర అడుగుల చప్పుడు వినిపించింది.

రూప ఆతృతగా గుమ్మంవైపే చూస్తోంది. ఆమె చూస్తూండగా ఒక వ్యక్తి మెరుపువేగంతో గదిలో ప్రవేశించి తలుపులు బోల్టు వేశాడు. అతను తనవైపు తిరగగానే రూప ఉలిక్కిపడింది.

అతను చంద్రశేఖరం కాడు! యెవరో గడ్డపు వ్యక్తి....!

"ఎవర్నువ్వు?" కంగారుగా లేచి నిలబడింది రూప.

అతను తాపీగా ఆమెను సమీపించి—"వెరీగుడ్! నువ్వు నన్ను గుర్తు పట్టలేదన్నమాట. అయితే వేషం బాగున్నట్లే లెక్క...." అన్నాడు.

ఆమె కంఠాన్ని గుర్తుపట్టి—"చంద్రశేఖరం....!" అంది.

అతని మారువేషాన్ని తొలగించి—"ఈ వేషంలో నేనూ, అబ్బాయి వేషంలో నువ్వూ ఇక్కణ్ణించి బయట పడతాం—ఎలా ఉంది మన ప్లాను—...." అన్నాడు.

"బాగుంది—" అంది రూప—"మన పథకం ఏమిటో వివరంగా పూర్తిగా చెప్పు—"

"చెబుతాను. ముందు నగలు చూపించు—"అన్నాడు చంద్రశేఖరం.

రూప సూట్ కేసు తెరిచింది. పైన పేర్చిన తన బట్టలు తీసింది. అడుగున ఉన్న ఆ నగలు చూసి అతను నోట మాట రాకుండా నిలబడిపోయాడు.

"అద్భుతం!" అన్న మాటలు అప్రయత్నంగా అతడి నోటమ్మట వచ్చాయి.

"తాకట్టు పెడితే రెండు లక్షలకు తక్కువ రాదు" అంది రూప.

"అమ్మితే?" అన్నాడు చంద్రశేఖరం.

"ఏ పరిస్థితుల్లోనూ ఇవి అమ్మడానికి వీల్లేదు. తరతరాలుగా మా ఇంట్లో ఉంటున్న నగలివి" అంది రూప.

"అబ్బే—ధర తెలుసుకోడానికి అడిగాను" అంటూ అతను రూపను దగ్గరగా తీసుకొన్నాడు. ఆమె అభ్యంతరం పెట్టలేదు. అతను ఆమె నడుముపై తన వ్రేళ్ళను తమాషాగా కదిలిస్తూ—"నాకోసం ఎంత సాహసం చేశావ్ రూపా!" అన్నాడు.

"నా సాహసం ఈ క్షణంలో ముగిసింది. ఇక ముందున్నదంతా నీ సాహసమే—" అంది రూప.

"అయితే నేను చేస్తున్న తొలిసాహసం ఇదిగో చూడు" అంటూ అతనామెను చటుక్కున తనవైపు తిప్పు

కుని బలంగా ముద్దు పెట్టుకున్నాడు. కొద్ది క్షణాలు మాత్రమే అతనికి సహకరించి చటుక్కున అతన్ని విడిపించుకుని "ఇలాంటి సాహసం ఎవరైనా చేస్తారు. నేను కోరినదది కాదు" అంది. అతని చిలిపితనానికి ఆమె బుగ్గలు యెరుపెక్కాయి. కళ్ళలో తొలిముద్దు సిగ్గులు స్పష్టంగా కనబడుతున్నాయి.

"నీ దగ్గర యిలాంటి సాహసం ఎవరు చేసినా వాళ్ళను నేను బ్రతకనివ్వను. ప్రస్తుతానికి నన్ను సాహసం చెయ్యనివ్వకపోతే నేను బ్రతకలేను" అన్నాడు చంద్రశేఖరం.

"మనకింకా పెళ్ళికాలేదు" అంది రూప.

"ఈ క్షణం నుంచీ మనం దంపతులం. గాంధర్వ వివాహం చేసుకుందాం" అన్నాడు చంద్రశేఖరం.

"గాంధర్వ వివాహం సంగతి తర్వాత చూద్దాం మన కార్యక్రమం సంగతి చెప్పు" అంది రూప.

"మన-అనకు. మనకింకా పెళ్ళి కాలేదు" అన్నాడు చంద్రశేఖరం చిరాగ్గా.

"మనం తల్చుకుంటే రేపే అవుతుంది మన పెళ్ళి" అంది రూప.

"రేపటిదాకా యెందుకు యిప్పుడే అవుతుంది. నేను తల్చుకున్నాను. ఇంక నువ్వే తల్చుకోవాలి!" అన్నాడు చంద్రశేఖరం.

"నువ్వు మన కార్యక్రమం గురించి మాట్లాడ్డంలేదు" అంది రూప విసుగ్గా.

"ఏం మాట్లాడను-నేను అన్నీ వివరంగా చెబితే నన్ను నువ్వు నమ్ముతావా అని భయంగా ఉంది" అన్నాడు చంద్రశేఖరం.

"ఇప్పుడు నువ్వు నమ్మకం గురించి ఆలోచిస్తున్నావా? ఏ నమ్మకమూ లేకుండానే నేను ఇంతదూరం వస్తానా?" అంది రూప.

"అది కాదు రూపా-ప్రస్తుతానికి నాకో నగలిచ్చి కొంత కాలంపాటు మన పెళ్ళి వాయిదా వేయమన్నాననుకో. నువ్వు అంగీకరిస్తావా?" అడిగాడు చంద్రశేఖరం.

రూప ఉలిక్కిపడి "ఏమన్నావ్" అంది.

"ముందుగా డబ్బివ్వమన్నాననుకో నన్ను నువ్వు నమ్మ్తావా?" అన్నాడు చంద్రశేఖరం.

"దేనికైనా నిన్ను నమ్ముతాను. కానీ మనపెళ్ళి వాయిదా వెయ్యవలసిన అవసరమేమిటి?" అని కాస్త తీవ్రంగానే అడిగింది రూప.

"నాకు కొన్ని ఇబ్బందులున్నాయి రూపా!"

"ఏమిటివి?"

"నాకో మరదలుంది. అందంలో అది నీకు ఏమాత్రమూ తీసిపోదు. దానికి తల్లీ, తండ్రీ లేరు. మా ఇంట్లోనే మా పోషణలోనే వుంటోంది. నేను తనను పెళ్ళి చేసుకుంటానని దాని ఆశ. మా అమ్మకూడా అలాగే అనుకుంటోంది" అని ఆగాడు చంద్రశేఖరం.

"అయితే?" అంది రూప కంగారుగా.

"నేనిప్పుడు నిన్ను పెళ్ళి చేసుకుంటే మనిద్దరికీ అపవాదు వస్తుంది. డబ్బుకోసం మరదలికి అన్యాయం చేశానని నాకూ, చేయించావని నీకూ చెడ్డ పేరు వస్తుంది. అటుపైన నీ తండ్రి పగ ఉండనేవుంది. వీటన్నింటినీ తప్పించుకోవడానికి ఒకేఒక్క ఉపాయముంది—" అని ఆగాడు చంద్రశేఖరం.

"ఏమిటది?" అంది రూప అనుమానంగా.

"నేను నా మరదలికి మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాను. వ్యాపారం ప్రారంభించి ఓ ఏడాదిలోనే వృద్ధి లోకి వచ్చి నీ ఇంటికి వచ్చి ధైర్యంగానే నీ తండ్రికి మన ప్రేమవిషయం చెప్పి నిన్ను పెళ్లి చేసుకుంటాను" అన్నాడు చంద్రశేఖరం.

రూప సూటిగా చంద్రశేఖరం కళ్ళలోకి చూసింది. అతనామెతో కళ్ళు కలపలేక తల వంచుకున్నాడు. ఒక్క క్షణంపాటు ఇద్దరిమధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది. రూప నెమ్మదిగా అంది "సరే అలాగే చేయి. నా డబ్బు అక్కర్లే కుండా ఓ ఏడాదిలో గొప్పవాణ్ని కాగలననుకుంటే నాక్కావలసినదేముంది? నీ కోసం తప్పక ఎలాగో అలాగ ఓ యేడాది ఆగగలను."

"నేననుకున్న పనులు ప్రారంభించడానికి నాకు నీ డబ్బు కావాలి" అన్నాడు చంద్రశేఖరం వెంటనే.

"రేపే నన్ను రిజిస్ట్రాఫీసులో పెళ్లి చేసుకో. నా నగలు నీవే అవుతాయి" అంది రూప కూడా వెంటనే.

"చెప్పానుగా పెళ్లి యేడాది వరకూ సాధ్యంకాదని."

"అయితే నగల విషయం ఏడాదివరకూ మరచిపో" అంది రూప.

చంద్రశేఖరం ముఖం బాధగా అయిపోయింది. అతను దీనంగా రూప వంక చూసి "నువ్వు నన్ను నమ్మలేవన్న మాట!" అన్నాడు.

"ఎలా నమ్మగలను? నేను నగలు తీసుకొచ్చేవరకూ నీ మరదల కథ నాకు తెలియనేలేదు. పెళ్లి కాకుండానే నీకు నగలిస్తే-యింకా ఎన్ని కథలు వినాల్సివుంటుందో" అంది రూప. ఆమె మాటల్లో విషాదం కనబడుతోంది. అదే భావం ముఖంలో స్పష్టంగా కనబడుతోంది.

"పరస్పరావగాహన లేకపోతే మన దాంపత్యజీవనం బాగుండదు" అన్నాడు చంద్రశేఖరం.

"నీ అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను" అంది రూప.

రూప అలాగ నేసరికి ఏమనాలో తెలియలేదు చంద్రశేఖరానికి. అతడు భారంగా నిట్టూర్చి "ఆఖరికి మన ప్రేమ ఇలాగౌతుందనుకోలేదు" అన్నాడు.

"నేనూ అనుకోలేదు" అంది రూప.

"అయితే నగలు యివ్వనంటావ్" అన్నాడు చంద్రశేఖరం.

"ఇవ్వను" అంది రూప.

"ఒకవేళ నేను బలవంతంగా తీసుకువెడితే."

"పోలీసులు నిన్ను పట్టుకుంటారు" అంది రూప.

"ఊహూఁ" అని నిట్టూర్చాడు చంద్రశేఖరం.

"ఓకే రూపా! నీ యిష్టప్రకారమే కానీ-నేను బాగా ఆలోచించుకుని నీకు తర్వాలోనే ఏ విషయమూ చెబుతాను."

అంటూనే చటుక్కున ఒక చేయితో ఆమె నోరు మూశాడు. రెండో చేయి ఆమె గుండెల్లోకి సూటిగా కత్తిని దింపింది.

"సారీ రూపా! నీ ప్రేమను నేనసలు పట్టించుకోలేదు. అవసరంకోసం అలా నటించాను. నిన్ను పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం నాకెన్నడూ లేదు. మామూలుగా నగలు నాకిచ్చేసివుంటే, కనీసం నీ ప్రాణాలు నీకు దక్కివుండేవి. ఈ నగల చోరీ విషయంలో నన్ను పట్టివ్వగల ఏకైక సాక్షివి నువ్వే-అందువల్ల హత్య చేయక తప్పలేదు నాకు" అన్నాడు చంద్రశేఖరం.

అతను హత్యకు ముందుగా సిద్ధపడి వచ్చినట్లుంది తప్పితే అనుకోకుండా హత్య చేసినట్లు లేదు. ఇవన్నీ ఆలోచించి అవగాహన చేసుకునే స్థితిలో రూప ఉన్నట్లు లేదు. ఆమె శరీరం బలహీనమైనది. తల పక్కకు వాల్చేసిందామె.

చంద్రశేఖరం నగలున్న సూట్ కేసు తీసుకుని అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

* * *

తెల్లవారుజామున ఎవరో తలుపు తడితే బద్ధకంగా లేచి వెళ్ళాడు చంద్రశేఖరం. తలుపు తీయగానే అతనికి కనబడింది పోలీసులు.

పోలీసులు తనదగ్గర కెందుకొచ్చారు? తన నేరం బయట పడిపోయిందా? అయితే తనవల్ల ఎక్కడ పొరపాటు జరిగింది?

అతనాలోచిస్తూండగానే "రూపను హత్య చేసినట్లు నీపై అభియోగం" అన్నాడు పోలీస్ ఇన్స్పెక్టర్.

ఆ తర్వాత ఆయన ఏం మాట్లాడాడో చంద్రశేఖరానికి వినబడలేదు. అతనికి చాలా పెద్ద షాక్ తగిలినట్లుంది. స్పృహతప్పి కింద పడిపోయాడు.

10

"బాస్!"

"ఊఁ"

"చంద్రశేఖరానికి ఉరిశిక్ష పడింది."

"నువ్వు అందించిన ఆకారామన్న వివరాలు అంత పకడ్బందీగా వుంటే ఉరిశిక్ష పడకేం చేస్తుంది?"

"చంద్రశేఖరాన్ని చంపడంకోసం ఆ గదిలో నేను

చాలా సేపట్నించి ఎదురుచూస్తున్నాను. ముందు టీపా వచ్చింది. తర్వాత కొన్ని గంటలకు అతను వచ్చాడు. కానీ నేనూహించని విధంగా అతను హత్యచేశాడు. చివరిక్షణం వరకూ అతను హత్య చేస్తాడని నేననుకోలేదు బాస్...."

"హంతకుడంటే అలాగే వుండాలి."

"ముందు కాసేపు నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఆ చంద్రశేఖరాన్ని నేను చంపాల్సి వుందని గుర్తువచ్చేక ఈ హత్యకేసులో అతన్ని పట్టిచ్చేస్తే సరిపోదా అని పించి వెంటనే పోలీస్ స్టేషన్‌కు ఆకాశరామన్న ఫోన్ కాల్ చేశాను."

"ఏమైతేనేం హత్య చేయకుండానే చంపగలిగావ్ - అదృష్టవంతుడివి."

"చంద్రశేఖరంలాంటి నమ్మకద్రోహి, దుర్మార్గులు— ఒకరి చేతుల్లో చావక్కర్లేదు. తమ చేతుల్లో తామే చస్తారు."

"అ సమానూ అలా జరుగుతుందనుకోను. చంద్ర శేఖరం దగ్గర నువ్వు హంతకుడి మెలకువలు నేర్చుకుని వుంటే అవి ముందు ముందు పనికి వస్తాయి."

"వద్దు బాస్ నన్ను హంతకుణ్ణి చేయవద్దు."

బాస్ నవ్వి ఊరుకున్నాడు.

అతను ఏదో అనబోయి చటుక్కున ఏదో గుర్తుకు రాగా అక్కణ్ణించి కదిలాడు.

జ్యోతిష్కుడు చెప్పిన మాట నిజమైంది. తను బాస్ పని పూర్తి చేశాడు. అలాగని హత్య కూడా చేయలేదు. చేతిలోని రేఖలు చూసి మనిషి హంతకుడయ్యేదీ లేనిదీ ఖచ్చితంగా చెప్పవచ్చునన్న మాట!

అతను జ్యోతిష్కుడుండే చోటికి వెళ్ళాడు. జ్యోతిష్కుడికి మాటపదహార్లిచ్చుకోవాలని తన రేఖల్లో ఇంకా యేవేం విశేషాలున్నాయో తెలుసుకోవాలనీ అతని కోరిక.

కానీ అక్కడ జ్యోతిష్కుడు లేడు. పక్కన వాకబు చేయగా "ఎందుకో కొద్దిరోజుల క్రితమే వాడిక్కడ్నుంచి మకాం మార్చేశాడు సార్! ఏమని అడిగితే ప్రాణ ప్రమాదం అన్నాడు" అని కిళ్ళీకొట్టువాడు చెప్పాడు.

జ్యోతిష్కుడి మాట అబద్ధమైతే తను రెండో హత్య చేస్తాననడం అతనికి గుర్తువచ్చింది.

"అంటే నాకు కలిగించిన నమ్మకం ఆ జ్యోతిష్కుడికి లేదన్నమాట-తన మాట అబద్ధమవుతుందేమోనని భయపడి యిక్కణ్ణించి మకాం ఎత్తేశాడన్నమాట!" అనుకుని తనలో తనే నవ్వుకున్నాడతను.

—:ఐపోయింది:—